# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 26-04-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **15వ రోజ్‌గార్ మేళాలో భాగంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు దృశ్య మాధ్యమ విధానం ద్వారా 51 వేల మందికి నియామక పత్రాలు అందించారు.**
2. **'మత్స్యకారులకు చేయూత' కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో మరి కాసేపట్లో ప్రారంభించనున్నారు.**
3. **రాజధాని అమరావతిలో అన్ని సదుపాయాలను కల్పిస్తున్నామని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు.**
4. **కాకినాడ జిల్లాలో పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల పురోగతిపై రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సమీక్ష నిర్వహించారు.**
5. **విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఏర్పాటై నేటికి వంద సంవత్సరాలైన నేపథ్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.**

==========================

15వ రోజ్ గార్ మేళాలో భాగంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు దృశ్య మాధ్యమ విధానం ద్వారా 51 వేల మందికి నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. వారి కృషి దేశాన్ని ప్రపంచంలో గుర్తింపు పొందే స్థితికి తీసుకువెళ్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ సంవత్సరం బడ్జెట్‌లో ప్రకటించిన "మాన్యుఫాక్చరింగ్ మిషన్" ద్వారా మేడ్ ఇన్ ఇండియా ప్రోత్సాహంతో దేశవ్యాప్తంగా ఎంఎస్ఎంఈలు, చిన్న పారిశ్రామికవేత్తలకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని ప్రధానమంత్రి వివరిస్తూ...

.....వాయిస్.... 26 సెకన్లు....

--------------------------

'మత్స్యకారుల సేవలో' పథకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గంలోని బుడగట్లపాలెంలో మరి కాసేపట్లో ప్రారంభించనున్నారు. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా లక్షా 29 వేల 178 కుటుంబాలను అర్హులుగా గుర్తించిన ప్రభుత్వం, వారికి 20 వేల రూపాయల చొప్పున వేట నిషేధ భృతి చెల్లించనుంది. ఇందుకోసం 258 కోట్ల రూపాయలు కేటాయించారు.

--------------------------

రాజధాని అమరావతిలో అన్ని సదుపాయాలను కల్పిస్తున్నామని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. నెల్లూరు నగరంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. 64 వేల కోట్ల రూపాయలతో రాజధాని నిర్మాణ పనులను చేపడుతున్నామని.. మూడు సంవత్సరాలలో రాజధాని పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. వచ్చే 50 సంవత్సరాలను దృష్టిలో పెట్టుకుని.. అంతర్జాతీయ విమానాశ్రయం, స్పోర్ట్ సిటీని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు నిర్ణయించారని మంత్రి తెలిపారు. ఇందుకోసం పది వేల ఎకరాల భూమి అవసరం అవుతుందని, త్వరలోనే భూసేకరణ పూర్తి చేస్తామని నారాయణ స్పష్టంచేశారు.

-------------------------

ప్రతి నెలా మూడవ శనివారం నిర్వహించే 'స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా వచ్చే నెలలో 'వేడిని ఎదుర్కోవడం ఎలా' అనే అంశంతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్ తెలిపారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం వచ్చే నెలలో నీరు-మీరు, జూన్‌లో వేడిని ఎదుర్కోవడం ఎలా? అంశాలపై కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

-------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 121వ సంచిక రేపు ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

-------------------------

కాకినాడ జిల్లాలో పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు, రోడ్లు భవనాల శాఖకు చెందిన రహదారుల పురోగతిపై రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. పోర్టుల సందర్శనకు జిల్లాకు వచ్చిన మంత్రిని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ రాహుల్ మీనా ఈ రోజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పోర్టుల భూసేకరణ, నిర్మాణంలో తలెత్తుతున్న సమస్యలపై ఆ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి చర్చించారు. జిల్లాలో ఆర్ అండ్ బి రోడ్ల పురోగతి, వాటి స్థితిగతులు, భూసేకరణ అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తొండంగి మండలం పెరుమాళ్లపురంలో మంత్రి జనార్దన్ రెడ్డి పర్యటించి, కాకినాడ గేట్ వే పోర్టు పనులు పరిశీలించారు.

-------------------------

ఇండియా ఆడియో సమ్మిట్ అండ్ అవార్డ్స్ 2025లో ఆకాశవాణి ఆరు విభాగాల్లో ప్రతిష్ఠాత్మక పురస్కారాలు దక్కించుకుంది. ముంబయిలో నిన్న రాత్రి జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానీ రూపొందించిన 'నై సోచ్ నై కథానీ- ఏ రేడియో జర్నీ విత్ స్మృతి ఇరానీ' కార్యక్రమం సిరీస్ ఆఫ్ ది ఇయర్‌గా ఎంపికైంది. ఆకాశవాణి వార్తా విభాగం రూపొందించిన, ప్రజాదరణ చూరగొన్న ఫోన్-ఇన్ షో 'పబ్లిక్ స్పీక్' ఆరోగ్యం, ఫిట్‌నెస్ విభాగంలో బెస్ట్ ప్రొడ్యూస్డ్ ఆడియో స్ట్రీమింగ్ ప్రోగ్రామ్‌గా గుర్తింపు పొందింది.

ఇవి కాకుండా బెస్ట్ లేట్ నైట్ షోగా 'ఛాయాగీత్' .. బెస్ట్ సెలెబ్రిటీ షో ఆన్ ఎయిర్‌గా 'ఉజాలే ఉన్‌కీ యాదోన్ కె'... బెస్ట్ ట్రావెల్ షోగా 'సఫర్‌కాస్ట్' నిలిచాయి. తక్కువ సమయంలోనే పూర్తయ్యేలా రూపొందిన ఆడియో కంటెంట్ సృజనాత్మకత రూపకల్పనకు గానూ ఆకాశవాణి బెస్ట్ ఇంటర్‌స్టీషియల్ అవార్డును కూడా గెలుచుకుంది. ఈ కార్యక్రమానికి ఆకాశవాణి డైరెక్టర్ జనరల్ డాక్టర్ ప్రగ్యా పాలివాల్ గౌర్ గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని 'సూచించు, బోధించు, వినోదం పంచు' అనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న ఆకాశవాణి, ఆడియో రంగంలో జరుగుతున్న విప్లవంలో కీలకపాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 34 సెకన్లు....

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక ప్రగతే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రవ్యాప్తంగా 50 ఎం.ఎస్.ఎం.ఈ పార్కులను ప్రారంభించనున్నారని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో వచ్చే నెల ఒకటవ తేదీన ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఆయన నిన్న సాయంత్రం అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఆత్మకూరు సమీపంలోని.. నారంపేటలో ఎం.ఎస్.ఎం.ఈ పార్కుకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. నెల్లూరు పాలెం సమీపంలోని గిరిజన కాలనీలో పింఛను పంపిణీ చేసి అనంతరం మే డే సందర్భంగా కార్మికులతో చంద్రబాబునాయుడు ప్రత్యేకంగా సమావేశం అవుతారని మంత్రి వెల్లడించారు.

---------------------------

రాష్ట్రంలోని మైనార్టీల సంక్షేమానికి, ఆర్థికాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. అమరావతి సచివాలయంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన ఆధ్వర్యంలో మైనార్టీల స్వయం ఉపాధి కోసం రాయితీతో కూడిన బ్యాంకు రుణాల మంజూరు ప్రక్రియకు సంబంధించిన ఆనలైన్ బెనిఫిషియరీ మేనేజ్‌మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టమ్..ఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్‌ను మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫరూక్ మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మైనార్టీల స్వయం ఉపాధి కోసం రాయితీతో కూడిన బ్యాంకు రుణాలను కూటమి ప్రభుత్వం అందిస్తుందని పేర్కొన్నారు. ఇందుకోసం బడ్జెట్లో 169 కోట్ల 50 లక్షల రూపాయలు మంజూరు చేసిందని తెలిపారు.

---------------------------

విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఏర్పాటై నేటికి వంద సంవత్సరాలైంది. ఈ నేపథ్యంలో ఏడాది పాటు శతాబ్ది ఉత్సవాల నిర్వహణకు విశ్వవిద్యాలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. సంవత్సరం పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించారు. ఇందులో భాగంగా ఈ రోజు ఉదయం 6 గంటలకు విశాఖపట్నం బీచ్ రోడ్‌లో వాకథాన్ నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల 30 నిమిషాల నుంచి ప్రధాన వేడుక ప్రారంభం కానుంది.

======================